www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 93 | శనివారం | 14 నవంబర్, 2026

మోదీ నా ఫోన్ ట్యాప్ చేశారు

- నా ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ అందులోనే ఉన్నాయి
- ప్రధాని ముఖాముఖి చర్చకు వస్తే ఆయన రాజకీయ జీవితం ముగుస్తుంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



2



సరస్సు చూడతరమా!

కశ్మీర్ అందాలకు అద్దం పట్టే దాల్ లేక్ మరోసారి ప్రకృతి అందాలతో కనువిందు చేస్తోంది. ఆకాశమంతా నల్లని మేఘాలు పరుచుకోగా.. వాటి నీడలో సరస్సు సరికొత్త సొగసును సంతరించుకుంది. చల్లని గాలుల సవ్వడికి నీటి అలలు మెల్లగా కదులుతుంటే.. వాటిపై షికారా పడవలు నిశ్శబ్దంగా సాగిపోతున్నాయి. ఆకాశానికీ, సరస్సుకీ మధ్య మేఘాలు అల్లిన నీలినీడల చిత్రాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రకృతి ఒడిలో కాలం కాసేపు ఆగిపోయిందా అన్నట్లుగా కనిపిస్తున్న ఈ దృశ్యం.. ప్రకృతి సోయగాలకు.. శ్రీనగర్ సౌందర్యానికి నిలువెత్తు దర్పణంగా నిలుస్తోంది.



రూ.1,700 కోట్ల భారం ఎలా పెరిగింది?

- కొండపోచమ్మసాగర్ అదనపు వ్యయంపై విచారణ జరిపించాలి
- ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం సమాధానం చెప్పాలి
- ఎర్రవల్లిలో భూమి ఉంటే ప్రభుత్వానికి రాసిస్తా
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

2

భూముల వేలం ఆపాల్సిందే

- ప్రజాప్రయోజనాల స్థలాలను అమ్మితే ఊరుకోం
- కూకట్‌పల్లి భూములకు వేలం నిర్వహిస్తే ప్రత్యక్ష పోరాటానికి దిగుతాం
- కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

అభివృద్ధిని అడ్డుకోవడమే

విపక్షాల పని

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు త్వరలోనే పూర్తికానుంది. విచారణలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి. నా ఫోన్‌ను కేంద్ర ప్రభుత్వం ట్యాప్ చేసినా ఎలాంటి నష్టం లేదు.

నా ఫోన్ ట్యాప్ అయిందంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మీడియా ప్రశ్నించగా.. ఆ విషయాన్ని భారత్ సమ్మిట్‌కు హాజరుకానున్న రాహుల్‌గాంధీనే అడగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బదులిచ్చారు.

భారత్ సమ్మిట్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

- రాష్ట్ర ప్రయోజనాల కోసం చేసే కార్యక్రమాలనూ అడ్డుకుంటారా?
- విపక్షాల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ప్రజానావ, హైదరాబాద్:

తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి కార్యక్రమాన్నీ విపక్షాలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు, రాష్ట్ర పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఏమిటని నిలదీశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే 70 దేశాల ప్రతినిధులు తిరిగి వెళ్లేటప్పుడు తెలంగాణకు ప్రచారకర్తలుగా మారతారని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలన్న లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదని హితవు పలికారు. రాహుల్‌గాంధీ భారత్ సమ్మిట్‌కు వస్తే బీజేపీ నేతలకు వచ్చిన అభ్యంతరమేంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కాంగ్రెస్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, గురుదీప్‌సింగ్ సప్పల్‌తో కలిసి శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. నవంబరు 13, 14 తేదీల్లో జరిగే భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ముందు ఈ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ ప్రచారంలో భాగంగా ఇప్పటికే బెంగళూరు, ఢిల్లీ, చెన్నైలలో కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో ముంబై, అహ్మదాబాద్‌లలోనూ తరువాయి 2లో..



అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం

- 23మంది దుర్మరణం
- మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఢీ.. మరో 20 మందికి గాయాలు
- మృతుల్లో ఇద్దరు మహిళలు.. పలువురు కళాశాల విద్యార్థులు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

6

- జోర్హాట్ ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

రష్యాపై డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

- ఏడుగురి మృతి.. 17 మందికి గాయాలు

6



రూ.1,700 కోట్ల భారం ఎలా పెరిగింది?

- కొండపోచమ్మసాగర్ అదనపు వ్యయంపై విచారణ జరిపించాలి
- ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న సీఎం సమాధానం చెప్పాలి
- ఎర్రవల్లిలో భూమి ఉంటే ప్రభుత్వానికి రాసిస్తా
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ, సిద్దిపేట: కొండపోచమ్మసాగర్ టన్నెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండానే కాల్వగా మార్చడం వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం అదనంగా రూ.1,700 కోట్లు పెరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ అదనపు వ్యయానికి బాధ్యుల నుంచి డబ్బు రికవరీ చేయాలని గతంలో నివేదిక వచ్చినప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రం వద్ద తనకు, తన కుటుంబ సభ్యులకు ఒక్క గజం భూమి ఉన్నట్లు నిరూపించినా ఆ స్థలాన్ని ప్రభుత్వానికి రాసిస్తానని సవాల్ విసిరారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి శివారులో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి శుక్రవారం కవిత తన భర్త అనిల్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల భూనిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల విషయంలో భారాస నాయకులు రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు.

హరీశ్‌రావుపై ఆరోపణలు

అభివృద్ధి పనుల పేరుతో మాజీ మంత్రి హరీశ్‌రావు గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకున్నారని కవిత ఆరోపించారు. మంత్రిగా ఉన్న సమయంలో ప్రైవేటు ఆసుపత్రులను బెదిరించారని విమర్శించారు. నిమ్స్‌లో కొందరు ఉద్యోగుల ఈపీఎఫ్ నిధులకు సంబంధించి రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని బాధితులే లేఖ రాశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర, మాజీ మంత్రి బోడ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అంకితా హత్య కేసులో ఉర్మిళకు నార్కో పరీక్షలు

- పాలీగ్రాఫ్ పరీక్షలకూ కోర్టు ఆదేశం



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో సంచలనం సృష్టించిన అంకితా భండారీ హత్య కేసులో టీవీ నటి ఉర్మిళ సనావర్‌కు నార్కో అనాలిసిస్, పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించాలని డెహ్రాడూన్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఈ పరీక్షలకు ఆమె అంగీకరించినట్లు న్యాయవాది శివానీ తోమర్ తెలిపారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వైద్య పరీక్షల అనంతరం తేదీ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు. నార్కో పరీక్షకు వెళ్లకుండా అడ్డుకు నేందుకు దర్శన్ భారతి అలియాస్ జీడీఎస్ రావత్ అనే మతపెద్ద తనకు స్కార్పియో వాహనం, రూ.25 లక్షలు ఆఫర్ చేశారని ఉర్మిళ ఆరోపించారు. గత నెల 26న కోర్టు విచారణకు హాజరుకాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారని, అంతకుముందు రోజు సహరన్‌పుర్‌లో తనను అరెస్టు చేశారని చెప్పారు. ఇటీవల హరిద్వార్ కోర్టులో తనపై నమో దైన పరువునష్టం, వసూళ్ల కేసులో బెయిల్ పొందినట్లు తెలిపారు. తనను అరెస్టు చేసే సమయంలో పోలీసులు సీసీటీవీలు నిలిపివేశారని, మొబైల్‌ను రీసెట్ చేశారని, ఇంటి కెమెరాల హార్డ్‌డిస్క్ మాయమైందని ఆరోపించారు.

'వీఐపీ' కోణంపై విచారణ

పౌరి జిల్లాలోని వనాంతర రిసార్ట్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న 19 ఏళ్ల అంకితా భండారీ 2022లో హత్యకు గురైంది. రిసార్ట్ యజమాని పుల్కిత్ ఆర్య, అతని ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదైంది. హత్యలో ఓ 'వీఐపీ' ప్రమేయం ఉందంటూ ఉర్మిళ ఆరోపించడంతో వివాదం మొదలైంది. మాజీ బీజేపీ ఎమ్మెల్యే సురేశ్ రాథోడ్‌తో కలిసి ఆమె గత నెలలో నార్కో పరీక్షలకు అంగీకరించారు. ఈ కేసులో 'వీఐపీ' ప్రస్తావన ఉన్న ఆడియో క్లిప్‌పై వివరణ ఇవ్వాలని సీబీఐ వీరిద్దరికీ నోటీసులు జారీ చేసింది. ఇటీవల సిక్కిం గవర్నర్‌గా నియమితులైన దుష్యంత్ గౌతమ్ పేరును ఈ ఆరోపణలతో ముడిపెడుతూ ప్రచారం జరుగుతుండగా.. ఆయన వాటిని ఖండించారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే విపక్షాల పని

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టనున్నట్లు వెల్లడించారు. భారత్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు కొందరు ప్రతినిధులకు తొలుత అనుమతు లిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. చివరి నిమిషంలో వీసాలను రద్దు చేసిందని ఆరోపించారు.

బీజేపీ నేతలకు అభ్యంతరమేంటి?

గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక విధానాన్ని శనివారం ప్రారంభించేందుకు రాహుల్‌గాంధీని ఆహ్వానించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన సందేశం ఇస్తే బీజేపీ నేతలకు అభ్యంతరమేంటని ప్రశ్నించారు. ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లి ప్రసంగాలు చేసినప్పుడు అభ్యంతరం చెప్పని వారు.. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వస్తే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. రాహుల్‌ను రాజకీయంగా మళ్లీ పరిచయం చేయాల్సిన అవసరం లేదని, ఆయన 2004 నుంచే రాజకీయాల్లో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ కర్టెన్‌రైజర్‌కు కేంద్ర మంత్రి పీయూష్



గోయల్ హాజరైనప్పుడు అభ్యంతరం చెప్పని విపక్షాలు.. భారత్ సమ్మిట్‌కు రాహుల్ వస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నాయని ప్రశ్నించారు.

ప్రతి కార్యక్రమానికీ అడ్డంకులేనా?

భారత్ సమ్మిట్ ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగమవుతున్నాయన్న బీజేపీ, బీఆర్ఎస్ నేతల ఆరోపణలను సీఎం ఖండించారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ట్రిపుల్ ఆర్, తుమ్మిడిహెట్టి వంటి ప్రాజెక్టులను కూడా విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను అడ్డుకోవడం రాష్ట్రానికి నష్టం కలిగించడమేనని అన్నారు. వివిధ రంగాల నిపుణులను ఆహ్వానించి రాష్ట్రంలోని పారిశ్రామిక అవకాశాలు, విధానాలను ప్రత్యక్షంగా వివరించడమే భారత్ సమ్మిట్ ఉద్దేశమని స్పష్టం చేశారు. అవసరమైతే బీజేపీ నేత కిషన్‌రెడ్డి కూడా సమ్మిట్‌కు వచ్చి సూచనలు ఇవ్వవచ్చని అన్నారు. కిషన్‌రెడ్డికి తెలంగాణ ప్రయోజనాల కంటే గుజరాత్ ప్రయోజనాలే ముఖ్యమని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గిఫ్ట్ సిటీని తెలంగాణకు కాకుండా గుజరాత్‌కు కేటాయించినప్పుడు ఆయన ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. రాహుల్ పర్యటనను అడ్డుకుంటామని, నల్లజెండాలు చూపిస్తామని బీజేపీ నేతలు ప్రకటించడంపై మండిపడ్డారు. బీఆర్ఎస్ మద్దతు వల్లే బీజేపీకి ఎనిమిది ఎంపీ స్థానాలు దక్కాయని వ్యాఖ్యానించారు.

నిపుణులతో చర్చించి పరిష్కారాలు

ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం సరిగా స్పందించడం లేదన్న కేటీఆర్ విమర్శలపైనా సీఎం స్పందించారు. వాతావరణ పరిస్థితులపై నిపుణులను భారత్ సమ్మిట్‌కు ఆహ్వానించి, వారి సలహాలతో సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నామని తెలిపారు. కేటీఆర్ కూడా సమ్మిట్‌కు వచ్చి చర్చల్లో పాల్గొనవచ్చన్నారు. ప్రభుత్వ ఖర్చు చేసే ప్రతి పైసాకూ లెక్క ఉంటుందని, రాహుల్‌గాంధీని ప్రోత్సహించేందుకు ప్రజాధనాన్ని వినియోగిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని రేవంత్ స్పష్టం చేశారు.

కరవు కష్టాల నుంచి గట్టెక్కించండి

- రేపు ప్రధాని మోదీతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ భేటీ
- ఎల్‌నినో ప్రభావం.. రూ.20వేల కోట్ల పంట నష్టం అంచనా
- 365 కరవు మండలాల పరిస్థితిపై సమగ్ర నివేదిక

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర సాయం కోరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 15న దిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశం కానున్నారు. రాష్ట్రంలో వర్షాభావం, పంటల నష్టం, భూగర్భ జలాల తగ్గుదల, సాగు, తాగునీటి సమస్యలపై రూపొందించిన సమగ్ర నివేదికను ప్రధానమంత్రికి అందజేయనున్నారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు, రైతులు, గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థికసాయం విడుదల చేయాలని కోరనున్నారు. వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భజలాలు అడుగంటడం, ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల పరిధిలో సాగు విస్తీర్ణం తగ్గడం వంటి పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రభావంతో రాష్ట్రంలో 365 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. ఎల్‌నినో కారణంగా పంటలకు ప్రాథమికంగా సుమారు రూ.20వేల కోట్ల నష్టం వాటిల్లవచ్చని అంచనా వేసింది. ఆ తర్వాత వివిధ శాఖల నుంచి పంట నష్టాలు, సాగు, తాగునీటి ఇబ్బందులు, పశుగ్రాసం కొరత, యాసంగి సాగుకు ఎదురయ్యే సమస్యలపై వివరాలు సేకరించింది. వాటన్నింటినీ సమీకరించి కేంద్రానికి సమర్పించేందుకు నివేదిక సిద్ధం చేసింది.

జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రధాని పర్యటనకు ముందు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రధాని వద్ద ప్రస్తావించాల్సిన అంశాలు, రాష్ట్రంలో నీటి పరిస్థితిపై చర్చించారు. భూగర్భజలాల స్థితిగతులపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచేందుకు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జల మట్టాలు వేగంగా పడిపోతున్న ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సమాచారం అందించాలని సూచించారు. కేంద్ర ఆర్థికసాయం కోరనున్న నేపథ్యంలో జల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర సూచనలు సిద్ధం చేయాలని చెప్పారు.

సరోగసీపై ఉక్కుపాదం

- అన్ని రకాల పద్ధతులపైనా చైనా సంపూర్ణ నిషేధం

బీజింగ్: సంతాన సాఫల్యం పేరుతో మహిళల ఆరోగ్యానికి, హక్కులకు భంగం కలిగిస్తున్న అక్రమ సరోగసీ కార్యకలాపాలపై చైనా ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇకపై అన్ని రకాల సరోగసీ ప్రక్రియలను నేరంగా పరిగణించనున్నట్లు ప్రకటించింది. ఈ తరహా సేవలు అందించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని నేషనల్ హెల్త్ కమిషన్ అధికార ప్రతినిధి యాంగ్ జిన్‌రుయ్ స్పష్టం చేశారు. పునరుత్పత్తి సేవల కేంద్రాల నిర్వహణకు ఇకపై ఎలాంటి చట్టబద్ధత ఉండదని తెలిపారు. చైనాలో వృద్ధుల జనాభా పెరుగుతుండటంతో సంతానోత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తోంది. అయితే అక్రమ పద్ధతుల్లో పిల్లలను కనడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సరోగసీపై 2001లోనే నిషేధం విధించినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఈ క్రమంలో సంతాన సాఫల్య కేంద్రాల ముసుగులో అక్రమంగా పునరుత్పత్తి సేవలు అందిస్తున్నట్లు పలు నివేదికలు వెలువడ్డాయి.

భూముల వేలం ఆపాల్సిందే

- భూముల వేలం ఆపాల్సిందే
- ప్రజాప్రయోజనాల స్థలాలను అమ్మితే ఊరుకోం
- కూకట్‌పల్లి భూములకు వేలం నిర్వహిస్తే ప్రత్యక్ష పోరాటానికి దిగుతాం
- అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తాం
- కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజానావ, హైదరాబాద్: ప్రభుత్వ భూముల విక్రయమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన స్థలాలను సైతం వేలం వేయడం దుర్మార్గమని మండిపడ్డారు. కూకట్‌పల్లిలోని హెచ్ఎండీఏ ట్రక్ పార్కింగ్ స్థలం వేలం నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరంగా మారిందని విమర్శించారు. కూకట్‌పల్లి హెచ్ఎండీఏ స్థలాన్ని వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసనలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ట్రక్ పార్కింగ్, నర్సరీ, ఆర్టీఏ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ స్థలాన్ని ప్రజాప్రయోజనాలకే వినియోగించాలని, వాణిజ్య అవసరాలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. 1982కి ముందు భూసేకరణ సమయంలో అప్పటి హుడా అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ భూములను నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించబోమని పేర్కొన్నారని హరీశ్‌రావు తెలిపారు. అందువల్ల వాటిని ప్రజల అవసరాలకే ఉపయోగించాలని, లేదంటే భూములు కోల్పోయిన రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013లోనూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థలాన్ని వేలం వేయడానికి ప్రయత్నించిందని, తాము వామపక్షాలతో కలిసి ఉద్యమించి అడ్డుకున్నామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రక్ పార్కింగ్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు, నర్సరీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి స్థలం కేటాయించామని చెప్పారు.


భూముల అమ్మకమే ప్రభుత్వ విధానమా?



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి పెట్టకుండా భూముల విక్రయాలపై ఆసక్తి చూపుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. కాప్రాలో 480 గజాలు, అమీన్‌పూర్‌లో 300 గజాల స్థలాలను విక్రయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో మియాపూర్ భూములను పదేళ్ల పాటు తాము కాపాడామని, ఇప్పుడు వాటినీ అమ్మేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే రూ.లక్ష కోట్ల విలువైన భూములను విక్రయించారని విమర్శించారు. కూకట్‌పల్లి స్థలాన్ని ఎకరాకు రూ.99 కోట్ల చొప్పున విక్రయించేందుకు ఈ నెల 27న వేలం నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటన ఇచ్చిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములను అమ్మనివ్వబోమని స్పష్టం చేశారు. వేలం నిర్వహిస్తే కొనుగోలు చేసినా, భవిష్యత్తులో భారాస అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని రద్దు చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. ఈ నిరసనలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఐ నేత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీడీసీఏలో మళ్లీ ఎన్నికలు నిర్వహించండి

- 27మంది సభ్యుల డిమాండ్
- మూడేళ్ల కూలింగ్ ఆఫ్ నిబంధన అమలు చేయాలని బీసీసీఐకి లేఖ



న్యూఢిల్లీ: ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్స్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)లో కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని 27 మంది సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాకు లేఖలు రాశారు. డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ, కోశాధికారి హరీశ్ సింగ్లా ఆరేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్నందున మూడేళ్ల కూలింగ్ ఆఫ్ కాలానికి వెళ్లాలని పేర్కొన్నారు. నవీన్ జిందాల్ నేతృత్వంలో 26 మంది సభ్యులు ఒక లేఖ పంపగా, రమణ్ సలూజా విడిగా మరో లేఖ రాశారు. లోధా కమిటీ నిబంధనల ప్రకారం.. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం ఏదైనా క్రికెట్ సంఘంలో ఆరేళ్ల పదవిలో ఉన్నవారు మూడేళ్లపాటు పదవులకు దూరంగా ఉండాలి. 2020 నవంబరు 10న బాధ్యతలు చేపట్టిన జైట్లీ, సింగ్లా ఈ నెల 9తో ఆరేళ్ల పూర్తి చేసుకున్నారని సలూజా పేర్కొన్నారు. కార్యదర్శి అశోక్ శర్మకూ ఈ నిబంధన వర్తింపజేయాలని కోరారు. ఆయన కార్యదర్శి కాకముందు అపెక్స్ కౌన్సిల్‌లో తొమ్మిదేళ్లు పనిచేశారు. డీడీసీఏ మాజీ కార్యదర్శి వినోద్ తిహారా కూడా జైట్లీ కూలింగ్ ఆఫ్‌కు వెళ్లకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ వివాదంపై జైట్లీ స్పందన అందుబాటులోకి రాలేదు. బీసీసీఐ జాతీయ క్రీడా పాలన చట్టం పరిధిలోకి వస్తే కూలింగ్ ఆఫ్ నిబంధన నుంచి మినహాయింపు లభించే అవకాశం ఉందని డీడీసీఏ అధికారి ఒకరు తెలిపారు.

నెరవేరనున్న ఆటో కార్మికులకు సొంతింటి కల

హైదరాబాద్‌లో 2 వేల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం

- రూ.220 కోట్లతో 'ఆటో నగర్ కాలనీ' ఏర్పాటు
- నాలుగు ప్రాంతాల్లో ఒక్కోచోట 500 ఇళ్ల చొప్పున నిర్మాణం

ప్రజానావ, హైదరాబాద్: నగరంలో ఆటోరిక్షాలు నడుపుతూ జీవనం సాగిస్తున్న కార్మికులకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని చేపట్టింది. వారి కోసం హైదరాబాద్‌లో 2 వేల ఇళ్ల నిర్మాణానికి అనుమతిచ్చింది. 'ఆటో నగర్ కాలనీ' పేరుతో రూ.220 కోట్ల అంచనా వ్యయంతో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన ఇళ్లను నిర్మించనుంది.

నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఒక్కోచోట 500 ఇళ్ల చొప్పున చేపట్టే ఈ ప్రాజెక్టు బాధ్యతను తెలంగాణ హౌసింగ్ బోర్డుకు అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటోరిక్షా కార్మికులకు ప్రత్యేకంగా గృహ నిర్మాణ పథకం అమలు చేయాలన్న తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసిం గ్ కమిషనర్ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందిరమ్మ ఇళ్ల–టవర్ల పథకం తరహాలోనే ఈ కాలనీని అభివృద్ధి చేయనున్నారు. బండ్లగూడలోని ఎల్ఐసీ కాలనీ, గంధంగూడ, పేట్‌బషీరాబాద్, జల్‌పల్లి/లక్ష్మీ గూడ ప్రాంతాల్లో నిర్మాణాలకు స్థలాలను గుర్తించారు. ఒక్కో ప్రాంతంలో 500 ఇళ్ల చొప్పున మొత్తం 2వేల ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆటో కార్మికులకే ప్రత్యేక కేటాయింపు

ఇందిరమ్మ ఇళ్ల–టవర్ల పథకానికి వర్తించే మార్గదర్శకాలనే ఆటో నగర్ కాలనీకి కూడా అనుసరించనున్నారు. లబ్ధిదారుల అర్హతలు, ఆర్థిక సాయం, రిజర్వేషన్లు, ఎంపిక, ఇళ్ల కేటాయింపు విధానాలు అదే తరహాలో ఉంటాయి. అయితే ఈ పథకం కింద ఇళ్లు పొందాలంటే దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఆటోరిక్షా కార్మికులై ఉండాలనే నిబంధన విధించారు. మరోవైపు, సీర్ ప్రాంతం, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ కేటగిరీలకు చెందిన లక్ష రసమైన ధరల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా సీర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా 12 వేల ఇళ్ల నిర్మాణానికి అనుమతిచ్చింది. స్థలాల లభ్యత, అనుకూలత, సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు, ఆర్థిక ప్రతిపాదనలు సమర్పించాలని హౌసింగ్ బోర్డును ఆదేశించింది. ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడం, గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



మోదీ నా ఫోన్ ట్యాప్ చేశారు

- నా ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ అందులోనే ఉన్నాయి
- ప్రధాని ముఖాముఖి చర్చకు వస్తే రాజకీయ జీవితం ముగుస్తుంది
- అదానీ లేదా మోహన్ భగవత్‌ను న్యాయనిర్ణేతగా పెట్టినా ఓకే: రాహుల్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. మోదీపై తాను చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ ఆ ఫోన్‌లోనే ఉన్నాయని చెప్పారు. ప్రధాని తనతో ముఖాముఖి చర్చకు వస్తే ఆయన రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ వ్యాఖ్యలు చేశారు. మోదీతో బహిరంగ చర్చకు రావాలన్న తన సవాలును మరోసారి పునరుద్ఘాటించారు. పార్లమెంట్‌లోనే చర్చ జరపవచ్చని బీజేపీ నేతలు చెబుతున్న నేపథ్యంలో.. తనకు అక్కడ మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని రాహుల్ విమర్శించారు. మైక్ నిలిపివేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ చట్టాలు, ఓట్ల చోరీ, ఎస్ఐఆర్, చైనా, జనరల్ నరవణె పుస్తకం, ఎప్‌స్టీన్ అంశాలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించలేదన్నారు. మోదీతో నేరుగా ముఖాముఖి చర్చ జరగాలని, దీనికి అదానీ లేదా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను న్యాయనిర్ణేతగా నియమించినా తనకు అభ్యంతరం లేదని చెప్పారు. ఎవరు విదేశీ శక్తుల నియంత్రణలో ఉన్నారు? ఎవరు దేశద్రోహి? అన్నది చర్చలో తేలుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లోనూ వీడియో పోస్టు చేశారు.

టెలీప్రాంప్టర్ తెచ్చుకున్నా ఓకే

మరో పోస్టులో మోదీ టెలీప్రాంప్టర్ ఉపయోగించడంపై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తనతో చర్చకు టెలీప్రాంప్టర్ తెచ్చుకున్నా అభ్యంతరం లేదన్నారు. రాహుల్ సవాళ్లపై బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్లమెంట్‌లో చర్చలకు ఆయన దూరంగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. చర్చకు పార్లమెంటే సరైన వేదిక అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా బాధ్యత, గంభీరతతో వ్యవహరించాలని సూచించారు.



షిరిడీ సాయిబాబాను దర్శించుకున్న హీరో రామ్ చరణ్

ముంబై: టాలీవుడ్ హీరో రామ్ చరణ్ శుక్రవారం షిరిడీ సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ట్రస్టీలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి, సాయిబాబా ప్రతిమను అందజేశారు. అనంతరం రామ్ చరణ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బాబాను దర్శించుకోవాలన్న కోరిక నేటితో నెరవేరిందని, దర్శనం తర్వాత ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తమ ఇంట్లో సాయిబాబా భజనలు, కీర్తనలు జరుగుతుంటాయని, త్వరలో మరోసారి దర్శనానికి వస్తానని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖైరతాబాద్ ఉప ఎన్నికపై న్యాయపోరాటం

- హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం ప్రాతినిధ్యం లేని ఏకైక అసెంబ్లీ నియోజకవర్గం ఖైరతాబాద్ అని చింతల తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉప ఎన్నిక జరగకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం సహకరించుకుంటూ అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి న్యాయపరమైన పోరాటం కొనసాగించేందుకు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

రైతులు మద్దతు ధరను సద్వినియోగించుకోవాలి

- సింగిల్ విండో డైరెక్టర్ కాసరపు శ్రీనివాస్ రెడ్డి



ప్రజానావ, చందుర్తి: రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సద్వినియోగించుకోవాలి సింగిల్ విండో డైరెక్టర్ కాసరపు శ్రీనివాస్ రెడ్డి సూచించారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గస్కంటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొట్టే ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామి, గ్రామ సర్పంచ్ మరాటి మల్లిక్, ఉప సర్పంచ్ పూడూరి జీవన్ రెడ్డి, శ్రీ మోహిని కుంట మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ చింతకుంట గంగాధర్, వార్డ్ మెంబర్స్ చింతకుంట బాపన్న, ఎల్లే కిషన్, మరి గడ్డ సర్పంచ్ దూది శ్రీనివాసరెడ్డి, అనంతపల్లె సర్పంచ్ బాబు, నాయకులు గంగాధర్, మురళి, పెరిక రాజు,పెరిక రాజయ్య గ్రామ ప్రజ లు రైతులు పాల్గొన్నారు.

వేధింపులకు యువ క్రికెటర్ ఆత్మహత్య

ప్రజానావ, వికారాబాద్: బీసీసీఐ అండర్–19 మహిళా జట్టుకు ఎంపికైన యువ క్రికెటర్ నందిని (17) ఆత్మహత్య చేసుకోవడం వికారాబాద్‌లో విషాదం నింపింది. స్థానిక యువకుల వేధింపుల కారణంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. యాలాల మండలం సంగయ్యపల్లికి చెందిన నందిని క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ శిక్షణ పొందుతోంది. ఇ టీవల అండర్–19 జట్టుకు ఎంపికై త్వరలో ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉండగా, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అనిల్, కృష్ణ అనే ఇద్దరు యువకులు కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నారని, వారిలో ఒకరు ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురిచేయగా మరొకరు సహకరించేవారని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



బెంగళూరు మెట్రో పింక్ లైన్ ప్రారంభం

- రూ.3,470 కోట్లతో నిర్మించిన మార్గాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- సీఎం డీకే శివకుమార్‌తో కలిసి మెట్రో రైలులో ప్రయాణం
- 21.25 కి.మీ. మార్గంలో మొత్తం 18 స్టేషన్లు
- రేపటి నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి 7.5 కి.మీ. ఎలివేటెడ్ మార్గం

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మెట్రో రైలు పింక్ లైన్‌లోని తొలి దశ అందుబాటులోకి వచ్చింది. కలేన అగ్రహార నుంచి తవరెకెరె వరకు నిర్మించిన మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.3,470 కోట్ల వ్యయంతో ఈ మార్గాన్ని నిర్మించారు. సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ప్రధాని కొత్త మెట్రో రైలుకు జెండా ఊపి సేవలను ప్రారంభించారు. అనంతరం ఇద్దరూ కలిసి రైలులో ప్రయాణించారు. వీరిద్దరూ టికెట్ కౌంటర్ వద్ద విడివిడిగా టికెట్లు కొనుగోలు చేయడం విశేషం.

21.25 కి.మీ. పొడవున 18 స్టేషన్లు

మొత్తం పింక్ లైన్ 21.25 కిలోమీటర్ల పొడవున 18 స్టేషన్లతో నిర్మితమవుతోంది. ఇందులో ఆరు స్టేషన్లతో కూడిన ఎలివేటెడ్ మార్గాన్ని ప్రధాని ప్రారంభించారు. మిగిలిన 12 స్టేషన్లతో కూడిన భూగర్భ మార్గం నిర్మాణంలో ఉంది. కలేన అగ్రహార నుంచి తవరెకెరె, సుద్దగుంటెపాళ్య వరకు 7.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ మార్గం ఉంది. ఇది జయదేవ స్టేషన్ వద్ద ఎలక్ట్రానిక్ సిటీ మెట్రో మార్గంతో అనుసంధానమవుతుందని అధికారులు తెలిపారు.

డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు ఉపశమనం

మెట్రో రైలు మార్గంతోపాటు ఫ్లైఓవర్ నిర్మించిన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రయోజనాలను సీఎం శివకుమార్ ప్రధానికి వివరించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఈ నిర్మాణం ఉపయోగపడుతుందని తెలిపారు. గవర్నర్ సుధా యాదవ్, ఎంపీ తేజస్వి సూర్య, మంత్రి కేబీ గౌడ కూడా మెట్రో రైలులో ప్రయాణించారు.

రేపటి నుంచి ప్రయాణికులకు సేవలు

నూతన మార్గంతో నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణ సమయం తగ్గడంతోపాటు రోజువారీ ప్రయాణికులకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. నవంబరు 14న ఉదయం 6 గంటల నుంచి ఈ మార్గంలో ప్రజలకు మెట్రో సేవలు అందుబా టులోకి రానున్నాయి.



అలుగునూర్‌లో దీక్షా దివస్ సభకు సన్నాహాలు

- సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లపై నేతలతో కలిసి గంగుల కమలాకర్ పరిశీలన
- 29న భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజానావ, కరీంనగర్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో సభ నిర్వహించనున్న ప్రాంతాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నరాదాసు లక్ష్మణ రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవిందర్ సింగ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు, మానకొండూర్ మాజీ జడ్పిటీసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్, కొత్తపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి సభాస్థలి పరిసరాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సభ నిర్వహణకు అనువైన ప్రాంతం, వేదిక ఏర్పాటు, సభకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ప్రాంతాల ఎంపిక, సభా ప్రాంగణానికి వచ్చే మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై నాయకులు సమాలోచనలు జరిపారు.

కేటీఆర్ రాకతో రాజకీయ ప్రాధాన్యత

ఈనెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీంతో అలుగునూర్‌లో నిర్వహించనున్న ఈ సభకు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణం ఎంపిక మొదలుకొని పార్కింగ్, ఇతర ఏర్పాట్ల వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు పార్టీ ముఖ్య నాయకులు సమాయత్తమవుతున్నారు. దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను ముందుకు తీసుకెళ్లే దిశగా గంగుల కమలాకర్ నేతృత్వంలో నాయకులు సభాస్థలిని పరిశీలించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజానావ, హైదరాబాద్: షార్ట్ సర్క్యూట్ కారణంగా గుడిసె పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన ఓ పేద కుటుంబానికి ఖైరతాబాద్ సీనియర్ నాయకుడు పల్లపు గోవర్ధన్ ఆర్థిక చేయూత అందించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ ఎదురుగా ఉన్న నవనిర్మాణ్‌నగర్‌లో రెండు రోజుల క్రితం నాగలక్ష్మి –శ్రీధర్ కుటుంబానికి చెందిన గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో గుడిసె పూర్తిగా కాలిపోవడంతో కుటుంబం సర్వస్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ ఘటన గురించి తెలుసుకున్న పల్లపు గోవర్ధన్ వెంటనే బాధిత కుటుంబం వద్దకు వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ తనవంతు సాయంగా రూ.20 వేల నగదును అందజేశారు. కష్టకాలంలో స్పందించి ఆర్థికసాయం చేసిన ఆయనను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రవి నాయక్, శ్రీనివాస్ నాయుడు, నరేష్, గణేష్ తదితరులున్నారు.



శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు

- మాజీ ఎమ్మెల్యే చింతల చొరవతో సమస్యల పరిష్కారానికి ముందడుగు







ప్రజానావ, హైదరాబాద్: ఫిలింనగర్ డివిజన్ పరిధిలోని 18 బస్తీల శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరయ్యాయి. ఆయా శ్మశానవాటికల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక బీజేపీ నాయకులు చేసిన విజ్ఞప్తికి స్పందనగా ఈ నిధులు విడుదలయ్యాయి. శ్మశాన వాటికల్లో తాగునీటి సౌకర్యం, వాటర్ ట్యాంకులు, కుళా యిలు, స్నానాల గదులు, ప్రహరీ గోడలు, అంతర్గత నడక మార్గాలు, ర్యాంపుల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉందని ఫిలింనగర్ డివిజన్ బీజేపీ నాయకు లు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఈ సమస్యలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ గంగాపురం కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి అపసరమైన నిధులసు మం జూరు చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన చింతల రామచంద్రారెడ్డికి, సహకరించిన కిషన్‌రెడ్డికి ఫిలింనగర్ డివిజన్ ప్రజల తరఫున బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఏఈ రాజేష్ చారి, ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుంటి ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా స్వాములకు మూడు నెలలు అన్నదానం

- పల్లపు గోవర్ధన్ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ
- ఫిలింనగర్ వినాయక్‌నగర్ పర్వత ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు
- నవంబర్ 11 నుంచి జనవరి 4 వరకు కొనసాగనున్న కార్యక్రమం




ప్రజానావ, హైదరాబాద్: అయ్యప్ప, ఆంజనేయ, శివ స్వాముల దీక్షా కాలాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ సీనియర్ నాయకుడు పల్లపు గోవర్ధన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్ పర్వత ఆంజనేయస్వామి ఆలయం వద్ద నవంబర్ 11న ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 4వ తేదీ వరకు కొనసాగనుంది. పల్లపు గోవర్ధన్ స్వయంగా ఖర్చులు భరిస్తూ దీక్షా స్వాములతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. దీక్షా సమయంలో స్వాములకు అన్నదానం చేయడం ద్వారా భక్తిసేవతోపాటు మానవతా విలువలను చాటుతున్నారని పలువురు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలి

ఫిలింనగర్‌లోని శ్రీ పర్వతాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భాగ్యనగర్ ఉత్తర సర్కిల్ కార్యదర్శి పల్లపు గోవర్ధన్ విమర్శించారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. సమీపంలోని మసీదు ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం సహకరించినప్పుడు, హిందువులు పూజించే పర్వతాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ఎందుకు తోడ్పడటం లేదని ప్రశ్నించారు. ఆలయ పరిసరాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని గోవర్ధన్ కోరారు. ఆలయ అభివృద్ధిపై అధికారులు, ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



దేశ రాజధాని ఢిల్లీలో యమునా నదీ తీరాన్ని పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఛత్ పూజ తొలి రోజు సందర్భంగా సోనియా విహార్‌లోని 'నమో యమునా రివర్ సఫారీ' వద్ద ప్రత్యేక లైట్ అండ్ సౌండ్ షో నిర్వహించారు. యమునా దేవి, శ్రీకృష్ణుడికి సంబంధించిన పౌరాణిక గాథలను కాంతులు, శబ్దాల సమ్మేళనంతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా యమునా నది చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించడంతోపాటు నదీ తీరాన్ని పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా హాజరయ్యారు. యమునా నదితో ముడిపడిన పురాణ కథలు, సంస్కృతి, సంప్రదాయాలను ఆధునిక సాంకేతికతతో ప్రజలకు పరిచయం చేసేలా ప్రదర్శనను రూపొందించారు. కాంతుల వెలుగులు, నేపథ్య సంగీతం, కథనాలతో నదీ వైభవాన్ని ఆవిష్కరించారు.









● యమునా తీరంలో ఛత్ పూజ సందడి

దేశవ్యాప్తంగా ఛత్ పూజ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు నదులు, చెరువులు, జలాశయాల వద్ద పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అస్తమించే సూర్యుడికి అర్ఘ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామునే నీటిలో నిలబడి ఉదయించే సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు లక్నో, థానే, రిషికేశ్, పాట్నా తదితర ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. సంప్రదాయ దుస్తులు ధరించిన భక్తులు, ప్రత్యేక అలంకరణలతో ముస్తాబైన ఘాట్లతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.













చందనోత్సవ వేడుకలకు ఆహ్వానాల అందజేత

ప్రజానావ, జగిత్యాల: జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 20 వరకు నిర్వహించనున్న స్వామివారి చందనోత్సవం,మహాసంప్రోక్షణ కార్యక్రమాలకు విచ్చేయవలసిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను దేవస్థానం తరఫున సహాయ కార్యనిర్వహణ అధికారి హరిహరనాథ్,ప్రధాన అర్చకులు మారుతీ ప్రసాద్ ప్రత్యేకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అదేవిధంగా జగిత్యాల జిల్లా కలెక్టర్, ఆర్డీఓ,అడిషనల్ కలెక్టర్ లతో కలిసి చందనోత్సవ వేడుకలకు ఆహ్వానించారు.



ఎంపీపీఎస్‌లో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భారత ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీ య బాలల దినోత్సవ ప్రాధాన్యతను, జవహర్లాల్ నెహ్రూ గొప్పతన్నాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కార్యక్రమాలను విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి నిర్వహించడం జరిగింది. విద్యార్థుల నుండి ఉపాధ్యాయులుగా ఉత్తమ తమ ప్రదర్శన చేసిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నందిని, లావణ్య, ఊరడి రవి, వేదప్రకాష్ జోషి, కరుణ, రూప తదితరులు పాల్గొన్నారు.



భీమేశ్వర స్వామికి 'నీలకంఠ శతకం' సమర్పణ

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారికి భక్తుడు సింగిరెడ్డి రాజిరెడ్డి తన సాహిత్య రచన 'నీలకంఠ శతకం'ను సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రాళ్ల రామన్నపేటకు చెందిన ఆయన ఆరు నెలల పాటు శ్రమించి ఈ శతకాన్ని రచించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రంథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ శేషవస్త్రం, లడ్డూ ప్రసాదంతో సత్కరించారు. గతంలో సింగిరెడ్డి శతకం, రామ శతకం రచించిన రాజిరెడ్డి తాజాగా మూడో శతకాన్ని సమర్పించడం విశేషం.

ఘనంగా సామూహిక కార్తీక దీపోత్సవం

ప్రజానావ, వేములవాడ: వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, నాలుగో రోజు వేడుకలను ఆలయ ఏఈఓ జయకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులకు, సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు,గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజానావ, వేములవాడ: భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కావడంతో పాటు శుక్రవారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అభిషేకాలు, అన్నపూజలు, కుంకుమ పూజ, చండీ హోమం, నిత్య కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన తదితర ఆర్జిత సేవలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గండ దీపంలో నూనె పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాస విశిష్టతను పురస్కరించుకుని భక్తులు ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి, అర్చకులకు దీపదానం చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగదేవత విగ్రహాలకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి హారతులు సమర్పించారు.





శాస్త్రీయ వ్యవసాయంతోనే మెరుగైన ఆదాయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, చందుర్తి: శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు..శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వేములవాడ, బాబు జగ్జీవన్ రామ్ సిరిసిల్ల, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల పొలాస వారి ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ఆది శ్రీనివాస్ సందర్శించి, వాటిలో ప్రదర్శించిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాగు విధానాలు, పంటల మార్పిడి, నేల సార పరీక్షలు, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులను, విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వ విప్ మాట్లాడుతూ భూమితో అనుబంధం కలిగి వ్యవసాయ, వెటర్నరీ విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో రైతులకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వ్యవసాయ రంగంలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, నేల స్వభావం, నేల సారాన్ని పరిశీలించి ఏ భూమిలో ఏ పంట సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందో అవగాహన కల్పించాలని సూచించారు..

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోందన్నారు. రైతులకు నేల సార పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, శాస్త్రీయ పద్ధతుల్లో పంటల ఎంపిక, పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించడం ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి జిల్లాలో రైతు విద్యా కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవ సాయ పరిశోధనలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం రైతు లకు చేరువ కావాలన్నది ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. విద్యార్థులు కళాశాలల్లో నేర్చుకున్న విద్యతో పాటు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి పొందిన అనుభవాన్ని భవిష్యత్తులో ఉపయోగించుకొని వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు.మూడపల్లిలో జరిగిన రైతు సదస్సులో తడగొండ గ్రామం ఆర్‌ఏడబ్ల్యూఈఓ విద్యార్థినులు మొదటి బహుమతి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ధాన్యం కొనుగోలు చేయాలి
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ప్రజానావ, కరీంనగర్: రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, వారికి ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని చామన్‌పల్లి, చర్లబూత్కూర్, ముగ్ధంపూర్ గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రైస్ మిల్లర్లు నేరుగా గ్రామాలకు వచ్చి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం తగ్గిపోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ ధాన్యానికి రూ.3,100 వరకు ధర లభిస్తుండగా, ప్రభుత్వ కొనుగోలు ధర రూ.2,900 ఉంటే రైతులు ప్రభుత్వ కేంద్రాలకు ఎందుకు ధాన్యం విక్రయిస్తారని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ప్రభుత్వం ధర కల్పిస్తే రైతులంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకొస్తారని పేర్కొన్నారు. హమాలీ ఖర్చులు, తాలు, తరుగు పేరుతో రైతులకు అదనపు భారం పడకుండా చూడాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతుల వద్దకే వచ్చి ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. మన రాష్ట్రంలో పండిన ధాన్యం మన రాష్ట్ర అవసరాలకే ఉపయోగపడేలా సివిల్ సప్లై ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

రైతులకు నమ్మకం కల్పించాలి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై రైతులకు నమ్మకం కలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ధర చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఈసారి 25 నుంచి 30 శాతం ధాన్యం మాత్రమే వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గంగుల కమలాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట. కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కరీంనగర్ ఫ్యాక్ట్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, దుర్వెడ్ ఫ్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, చెర్ల బూతుకూరు సర్పంచ్ కూర నరేష్ రెడ్డి, ముగ్ధమ్ పూర్ సర్పంచ్ సీనమ్మ , పలువురు గ్రామ ప్రతినిధులు, ఫ్యాక్స్ డైరెక్టర్లు, అధికారులు, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారితే కఠిన చర్యలు

- జిల్లావ్యాప్తంగా దాబాలు, హోటళ్లలో పోలీసుల మెరుపు దాడులు

ప్రజానావ, సిరిసిల్ల: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలు, రహదారుల వెంబడి ఉన్న హోటల్స్ లలో గురువారం రోజు రాత్రి పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా దాబాలు, హోటల్స్ లలో నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, సంబంధిత శాఖల అనుమతులు, లైసెన్సుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతులు లేకుండా పర్మిట్ రూములు నిర్వహించడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం, మద్యం సేవించేందుకు అనధికారికంగా ఏర్పాట్లు చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాబాలు, హోటల్స్ కేంద్రంగా చేసుకుని జూదం, పేకాట, సట్టా మట్కా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అలాగే ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దాబాలు, హోటల్స్ వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దాబాలు, ఇతర వ్యాపార కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత శాఖల అనుమతులు పొందడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

కుటుంబ వివాదాల పరిష్కారానికి ఫ్యామిలీ కౌన్సెలింగ్

- రాజీవ్ నగర్‌లో మనోవికాస సదస్సులో ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్

ప్రజానావ, సిరిసిల్ల : కుటుంబంలో భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు, ఆర్థిక సమస్యలు, పిల్లల పెంపకం, పరస్పర అనుమానాలు, మద్యపానం, పని ఒత్తిడి వంటి అంశాలు కుటుంబ వివాదాలకు కారణమవుతున్నాయనిప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రాజీవ్ నగర్‌లో మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్, ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం పవర్‌లూమ్ కార్మికులకు మనోవికాస సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అవి పెద్ద వివాదాలుగా మారి కుటుంబ ప్రశాంతతను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి



ప్రజానావ, కరీంనగర్: కరీంనగర్ పట్టణం రేకుర్తిలో కాళోజీ విగ్రహానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి, పద్మవిభూషన్..కాళోజి నారాయణరావు అని ఆయన సేవలను కొనియాడారు. ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజీ నారాయణ రావు వర్ధంతి వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా జరిగాయి. రేకుర్తిలోని కాళోజీనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కాళోజీ నారాయణ రావు విగ్రహానికి మేయర్, డిప్యూటీ మేయర్‌లతో పాటు కార్పొరేటర్లు, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాళోజీ సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని, నేటితరాలకు ఆదర్శ ప్రియుడని తెలిపారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అని నినాదించిన.. ప్రజాకవి కాళోజీ జీవితం అంతా తెలంగాణ భాష సాహితి సేవ దిశగా సాగిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవి– కృష్ణగౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం లక్ష్మీ – ప్రకాష్, గాజ రమ–శివరాం, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- పలు రాష్ట్రాల్లో ఏటీఎంలే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా
- రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేంద్రచారి



ప్రజానావ, సిరిసిల్ల : ఎల్లారెడ్డిపేట ఎస్ బీ ఐ ఏటీఎం ధ్వంసం చేసి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటనలో శుక్రవారం పోలీసులు చాక చక్యంగా వ్యవహరించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో రాజస్థాన్ లోని కొరియానాకు చెందిన బహదూర్ చౌకీదార్ ప్రతబరామ్ బవారీ(36), గోపాల్ తేజారామ్ బవారీ (34) ఉన్నారు. నిందితుల వివరాలను డీఎస్పీ నాగేంద్ర చారి వెల్లడించారు. ఈ నెల11 న తెల్లవారుజామున ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో ఉన్న ఎస్బిఐ ఏటీఎం లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.6,06,100 నగదును చోరీ చేయడంతో పాటు ఏటీఎం యంత్రాన్ని సైతం ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ కంపెనీ ఛానల్ మేనేజర్ దాడిగల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక అలాగే ఇతర శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితులను రాజస్థాన్ కి చెందిన బహదూర్ చౌకీదార్ ప్రతబరామ్ బవారీ, గోపాల్ తేజారామ్ బవారీ లుగా గుర్తించి వారిని అదుపులోకి అరెస్ట్ చేసి విచారించగా గతంలో రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అలాగే తెలంగాణ రాష్ట్రాల్లో పలు ఏటీఎంల చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలగా శుక్రవారం ఈ నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. ముఖ్యమైన ప్రదేశాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



- స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

ప్రజానావ, సిరిసిల్ల : బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన బాల్యవివాహ రహిత భారతదేశంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన బాల్యవివాహాల నిర్మూలన అవగాహన పోస్టర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల బాలికల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, సామాజిక జీవితంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాల్యవివాహాల నివారణకు పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ కవిత,ఆశ్రిత ఎన్జీవో స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పర్వతాలు, ఫైనాన్స్ మేనేజర్ వెంకటేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ స్రవంతి, జిల్లా కోఆర్డినేటర్ లహరి, హరిబాబు, ప్రశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అమెజాన్ నదిలో కరవు కాట్లు

బ్రెజిల్‌లోని అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతాన్ని కరవు తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సాధారణంగా నీటితో కళకళలాడుతూ, పడవల రాకపోకలతో నందడిగా కనిపించే నదీ ఉప నదులు ఇప్పుడు నీరు లేక వెలవెలబోతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి కారణాలు ఈ పరిస్థితికి దారితీస్తున్నాయి. అమెజాన్ నదికి ఉపనదిగా ఉన్న మనాక్విరి సరస్సులో నీటిమట్టం గణనీయంగా పడిపోవడంతో పెద్దఎత్తున ఇనుక మేటలు బయటపడ్డాయి. దీంతో నీటిపై ప్రయాణించాల్సిన పడవలు ఇనుక తిన్నెలపై నిలిచిపోయాయి. ఒకప్పుడు పడవలతో రద్దీగా ఉండే ప్రాంతం ఇప్పుడు ఎడారిని తలపిస్తోంది. నదులు, సరస్సులపై ఆధారపడి జీవించే స్థానిక ప్రజల రవాణా, నిత్యావసరాల సరఫరా, చేపల వేటపైనా ఈ కరవు ప్రభావం చూపుతోంది.

అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం

- 23మంది దుర్మరణం
- మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఢీ.. మరో 20 మందికి గాయాలు
- మృతుల్లో ఇద్దరు మహిళలు.. పలువురు కళాశాల విద్యార్థులు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- జోర్హాట్ ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

కజిరంగా: అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కజిరంగా జాతీయ పార్కు సమీపంలో శుక్రవారం మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉండగా.. పలువురు కళాశాల విద్యార్థులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. గోలాఘాట్ నుంచి నగావ్ వెళ్తున్న మినీ బస్సు.. కజిరంగా జాతీయ పార్కు సమీపంలోని కోహోరా పరిధిలో రంగాజన్ వద్ద 715వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కంటైనర్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదం హాథికులి టీ ఎస్టేట్ సమీపంలో చోటుచేసుకుంది. ట్రక్కు ఎగువ అసోం వైపు వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు అతివేగంతో ప్రయాణిస్తోందని, జాతీయ పార్కు సమీపంలో విధించిన వేగ పరిమితులను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

20మందికి తీవ్ర గాయాలు

ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసు, రెవెన్యూ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిలో 20 మందిని మెరుగైన వైద్యం కోసం జోర్హాట్‌కు పంపించారు. ఇందుకోసం తొమ్మిది అంబులెన్సులను వినియోగించినట్లు గోలాఘాట్ జిల్లా అధికారులు తెలిపారు. మరికొందరిని బొకాఖాట్, గోలాఘాట్ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

విచారణకు ఆదేశాలు

ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించనున్నట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. వాహనాలు నిబంధనలు పాటించాయా? బస్సులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారా? నిర్ణీత వేగాన్ని మించి ప్రయాణించారా? అనే అంశాలను పరిశీలించనున్నారు.



మృతదేహాలకు శుక్రవారం రాత్రి గోలాఘాట్‌లోని స్వాహిద్ కుశాల్ కొవర్ సివిల్ ఆసుపత్రిలో ప్రత్యేక లైట్ల ఏర్పాటు చేసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు అదనపు జిల్లా కలెక్టర్ జింటు బోరా తెలిపారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం

ఈ ప్రమాదంపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు రాష్ట్రం అండగా ఉంటుందని పేర్కొన్నారు. క్షతగాత్రులకు ఎలాంటి ఆలస్యం లేకుండా మెరుగైన వైద్యం అందించడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యమని వెల్లడించారు. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే అతుల్ బోరా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు సీఎం తెలిపారు.

పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా
- రాడార్‌పై దాడి చేశామన్న ఇరాన్

వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగాయి. బహ్రెయిన్ వైపు వచ్చిన ఇరాన్‌కు చెందిన రెండు డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా సైన్యం శుక్రవారం ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ముందస్తు హెచ్చరిక రాడార్ వ్యవస్థపై దాడి చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. సిరిక్ నౌకాశ్రయం వద్ద అమెరికా దాడికి ప్రతిస్పందనగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది. అయితే ఈ వాదనను అమెరికా ఖండించింది. మరోవైపు హార్ముజ్ జలసంధిలో ఎల్‌పీజీ ట్యాంకర్ మండుపాతరను ఢీకొని పేలినట్లు ఇరాన్ పేర్కొంది. ఈ ఘటనను స్వతంత్రంగా ధ్రువీకరించలేదు.

350 మంది సైనికులకు అంత్యక్రియలు

ఇరాన్–ఇరాక్ యుద్ధంలో మరణించిన గుర్తుతెలియని 350 మంది సైనికుల అవశేషాలకు ఇరాన్‌లో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. టెహ్రాన్‌లో 110 మందికి, ఇతర నగరాల్లో 240 మందికి అంత్యక్రియలు జరిపారు. అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గాజాలో చలికి చిన్నారి మృతి

గాజాలో తీవ్రమైన చలి కారణంగా తొమ్మిది నెలల కనాన్ అహ్మద్ అర్మీఖ్ మరణించాడు. వర్షాలకు చిన్నారి ఉంటున్న గుడారం నీటమునగడంతో చలి నుంచి రక్షణ లభించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గాజాలోని దాదాపు 20 లక్షల మందిలో అత్యధికులు తాత్కాలిక గుడారాల్లోనే నివసిస్తున్నారు. దుప్పట్లు, దుస్తులు, గుడారాల కొరతతో మరిన్ని మరణాలు సంభవించే ప్రమాదం ఉందని సహాయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. సహాయ సామగ్రిని ఇజ్రాయెల్ అడ్డుకుంటోందని ఐరాస సంస్థలు ఆరోపిస్తుండగా, వేలాది ట్రక్కుల సామగ్రిని అనుమతించినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. గత శీతాకాలంలో చలి కారణంగా పది మంది మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

రష్యాపై డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్


- ఏడుగురి మృతి.. 17 మందికి గాయాలు
- యుద్ధం ముగింపునకు అమెరికా చర్చలు
- యూరప్ భాగస్వామ్యానికి రష్యా అంగీకారం



కీవ్: రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రతరమైంది. రష్యా లక్ష్యంగా ఉక్రెయిన్ దాదాపు 1,200 డ్రోన్లతో భారీ దాడి చేసింది. వీటిలో 1,198 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. మూడు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 12 ఏళ్ల బాలుడితో సహా ఏడుగురు మరణించగా, 17 మంది గాయపడ్డారు. మరోవైపు యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా ఆధ్వర్యంలో జరుగుతున్న చర్చల్లో యూరప్ భద్రతా వ్యవస్థ అంశం తెరపైకి వచ్చింది. అబుదాబిలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులతో చర్చించిన అమెరికా ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్.. అనంతరం పుతిన్, జెలెన్‌స్కీకి వివరాలు అందించారు. తదుపరి చర్చల్లో యూరప్ కూడా పాల్గొనేందుకు రష్యా అంగీకరించిందని కుష్నర్ తెలిపారు. అయితే ముందుగా కాల్పుల విరమణ జరగాలని, ఆ తర్వాతే చర్చలు కొనసాగించాలని ఈయూ విదేశాంగ విధాన విభాగం అధిపతి కాజా కల్లాస్ స్పష్టం చేశారు. యూరప్ భవిష్యత్తును అమెరికా, రష్యాలు నిర్ణయించడానికి వీల్లేదని లక్సెంబర్గ్ ప్రధాని లూక్ ఫ్రైడెన్ అన్నారు. నాటోను, ప్రచ్ఛన్న యుద్ధానంతర భద్రతా వ్యవస్థను విచ్ఛిన్నం చేయడమే మాస్కో లక్ష్యమని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ విశ్లేషించింది. మరోవైపు రష్యా ఉక్రెయిన్‌పై 117 డ్రోన్లతో దాడి చేయగా ఇద్దరు మరణించారు. జపోరిజ్జియాపై దాడిలో ఐదుగురు చిన్నారులు సహా 13 మంది గాయపడ్డారు. దెబ్బతిన్న రెండు నివాస భవనాల నుంచి 14 మందిని సహాయక సిబ్బంది రక్షించారు.

నాగరికతల సంభాషణకు భారత్ వేదిక

- ఎస్‌సీఓ సదస్సుకు 15 దేశాల అంగీకారం చైనా, ఇరాన్ సహా దేశాల భాగస్వామ్యం ఖరారు
- పాక్ రాకపై ఆశాభావం.. ఈ నెల 20 నుంచి ఢిల్లీలో సమావేశాలు



న్యూఢిల్లీ: సంస్కృతి, నాగరికతల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో భారత్ కీలక అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమివ్వనుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు ఢిల్లీలోని చారిత్రక పురానా ఖిలాలో నాగరికతల సంభాషణ వేదిక జరగనుంది. చైనా, ఇరాన్ సహా 15 దేశాలు పాల్గొనేందుకు అంగీకరించాయని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శేఖావత్ తెలిపారు. ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరవుతారని వెల్లడించారు. శుక్రవారం భారత్ మండపంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 25 దేశాలకు ఆహ్వానాలు పంపగా, 15 దేశాలు అంగీకరించాయని చెప్పారు.

చైనా, కజకిస్థాన్, ఇరాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, అజర్‌బైజాన్, అర్మేనియా, బ్రహ్మెయిన్, నేపాల్, సౌదీ అరేబియా, కంబోడియా, తుర్కియే, శ్రీలంక ఇందులో ఉన్నాయని వివరించారు.

పాక్ వస్తుందని ఆశిస్తున్నాం

పాకిస్థాన్‌కు కూడా ఆహ్వానం పంపామని, ఆ దేశం నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉందని శేఖావత్ తెలిపారు. భారత్–పాక్ ఉగ్రవాద సమస్యలు, భారత్–చైనా సరిహద్దు వివాదాలు చర్చకు వస్తాయా? అన్న ప్రశ్నకు.. రాజకీయాలకు అతీతంగా సాంస్కృతిక సంబంధాల బలోపేతమే సదస్సు లక్ష్యమని చెప్పారు. భారత్ ఆహ్వానం అందినట్లు పాక్ విదేశాంగ శాఖ ఈ నెల 6న ధ్రువీకరించింది. సంస్థాగత సంప్రదింపుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది.

నాలుగు అంశాలపై చర్చలు

ఈ నెల 21, 22 తేదీల్లో నాగరికత, సాంస్కృతిక వ్యక్తీకరణలు, కళలు–వాస్తుశిల్పం, భాష–సాహిత్యం, ప్రాచీన గ్రంథాలపై చర్చించనున్నారు. సంస్కృతి దేశాల మధ్య సంభాషణకు, పరస్పర విశ్వాసానికి దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. పురానా ఖిలా భారత నాగరికతకు చారిత్రక సాక్ష్యమని, అక్కడి పురావస్తు ఆధారాల ద్వారా దేశ ఐదువేల ఏళ్లకు పైబడిన చరిత్రను విదేశీ ప్రతినిధులకు పరిచయం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సింధు లోయ నాగరికత సమయంలో పాకిస్థాన్ ఉనికిలో లేదని వ్యాఖ్యానించారు. ఎస్‌సీఓ దేశాల వారసత్వ సంపదకు యునెస్కో గుర్తింపు సాధించే ఉమ్మడి ప్రతిపాదనలపైనా చర్చించనున్నారు. సాంస్కృతిక, విదేశాంగ శాఖలు సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి.

వలసదారులపై నిషేధంపై సుప్రీంకోర్టు విచారణ

- దిగువ కోర్టుల తీర్పులను సవాలు చేసిన ప్రభుత్వం

వాషింగ్టన్: అమెరికా దక్షిణ సరిహద్దు వద్ద ఆశ్రయం కోరే వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించినని షేధంపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. ఈ ఉత్తర్వు చట్టవిరుద్ధమంటూ దిగువ కోర్టులు ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించనుంది. స్వదేశాల్లో వేధింపులు, ప్రాణహాని ఎదుర్కొంటున్నవారు అమెరికాలోకి ఏ మార్గంలో ప్రవేశించినా ఆశ్రయం కోరేందుకు ఫెడరల్ చట్టం అవకాశం కల్పిస్తోంది. అయితే ఆశ్రయం మంజూరుపై నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని, నిషేధం పరిధిలోని దరఖాస్తులను స్వీకరించకుండానే తిరస్కరించవచ్చని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. గతంలో దరఖాస్తుల పరిష్కారానికి ఏళ్ల సమయం పట్టడం వల్లే దక్షిణ సరిహద్దుకు వలసలు పెరిగాయని ప్రభుత్వ న్యాయవాదులు చెబుతున్నారు. ఈ వాదనను వలసదారుల తరఫు న్యాయవాదులు తోసిపుచ్చారు. ట్రంప్ బాధ్యతలు చేపట్టకముందే సరిహద్దు దాటేవారి సంఖ్య తగ్గిందని, ప్రతి దరఖాస్తునూ వ్యక్తిగతంగా పరిశీలించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఆశ్రయం కోరే అవకాశాన్ని అధ్యక్షుడు ఏకపక్షంగా రద్దు చేయలేరని పేర్కొంటున్నారు. 2025లో రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ ప్రకటించిన వలస నియంత్రణ చర్యల్లో ఈ నిషేధం కూడా ఒకటి.

ఖేల్‌రత్న లేకుండానే క్రీడా పురస్కారాలు

• రాష్ట్రపతి భవన్‌లో అవార్డులు ప్రదానం చేసిన ద్రౌపదీ ముర్ము • అర్జున అవార్డులకు ఎంపికైన 17 మంది క్రీడాకారులు

• తేజస్విన్ శంకర్, దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీకి పురస్కారాలు • కోచింగ్ విభాగంలో ముగ్గురికి ద్రోణాచార్య అవార్డులు







న్యూఢిల్లీ: ఈ ఏడాది జాతీయ క్రీడా పురస్కారాల్లో అత్యున్నతమైన ఖేల్ రత్న అవార్డుకు ఎవరినీ ఎంపిక చేయలేదు. అర్జున అవార్డులకు ఎంపికైన 17 మంది క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో పురస్కారాలు అందజేశారు. అథ్లెటిక్స్ క్రీడాకారుడు తేజస్విన్ శంకర్, చెస్ గ్రాండ్‌మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై అవార్డులు అందుకున్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, క్రీడల శాఖ కార్యదర్శి హరి రంజన్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 36 నిమిషాల పాటు వేడుక కొనసాగింది.

పునఃపరిశీలన తర్వాత అవార్డుల ప్రకటన

గత ఏడాది చివర్లో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ చేసిన సిఫార్సులను కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అసాధారణ రీతిలో పునఃపరిశీలించింది. అర్హులైన వారికే పురస్కారాలు దక్కాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో అవార్డుల ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ ఏడాది ఖేల్ రత్నకు ఎవరినీ ఎంపిక చేయకపోవడం గమనార్హం. చివరిసారిగా 2014లోనూ ఈ పురస్కారానికి ఎవరినీ ఎంపిక చేయలేదు.

తేజస్విన్, దివ్య దేశ్‌ముఖ్‌కు గుర్తింపు

2023 ఆసియా క్రీడల్లో డెకాథ్లాన్‌లో చారిత్రక రజత పతకం సాధించిన తేజస్విన్ శంకర్.. గత ఏడాది ఆసియా ఛాంపియన్‌షిప్‌లోనూ రెండో స్థానం పొందాడు. మోకాలి సమస్యతో ఇబ్బందిపడుతూనే కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించాడు. ఐచి–నగోయా ఆసియా క్రీడల్లోనూ కాంస్య పతకం గెలిచాడు. అవార్డుల ప్రకటనలో జాప్యంపై గతంలో అసంతృప్తి వ్యక్తం చేసిన క్రీడాకారుల్లో తేజస్విన్ కూడా ఉన్నాడు. 20 ఏళ్ల దివ్య దేశ్‌ముఖ్ ప్రపంచకప్ గెలిచిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది. విదిత్ గుజరాతీ 2024 చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో సభ్యుడు. వీరితోపాటు కామన్వెల్త్ క్రీడల రజత పతక విజేత, బాక్సర్ నరేందర్ బెర్వాల్, చెవిటి షూటర్ ధనుష్ శ్రీకాంత్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

పారా క్రీడల నుంచి ఇద్దరికే..

ఈసారి అర్జున అవార్డులకు ఎంపికైన వారిలో పారా క్రీడాకారులు ఇద్దరే ఉన్నారు. 2024 పారా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన క్లబ్ త్రో క్రీడాకారిణి ఏక్తా భయాన్, 2024 పారా ప్రపంచకప్‌లో స్వర్ణం గెలిచిన షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్ అవార్డుకు ఎంపికయ్యారు. గత ఏడాది ఢిల్లీలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఏక్తా రజత పతకం కూడా సాధించింది. 2024లో రికార్డు స్థాయిలో 32 మందికి అర్జున అవార్డులు ఇవ్వగా, వారిలో 17 మంది పారా క్రీడాకారులున్నారు. ఈసారి క్రికెట్ నుంచి ఒక్కరికీ అవార్డు దక్కలేదు. 2023లో పేసర్ మహమ్మద్ షమీకి అవార్డు వచ్చిన తర్వాత క్రికెటర్లకు ఈ పురస్కారం దక్కకపోవడం వరుసగా కొనసాగుతోంది.

జీవితకాల పురస్కారాలు.. ద్రోణాచార్య అవార్డులు

1962 ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత ఫుట్‌బాల్ జట్టులో సభ్యుడైన ఐ. అరుమైనాయగంకు అర్జున జీవితకాల సాఫల్య పురస్కారం లభించింది. ద్రోణాచార్య అవార్డులకు పర్వీర్ సింగ్, ఛోటే లాల్ యాదవ్, నేహా చవాన్ ఎంపికయ్యారు. మహిళ జాతీయ బాక్సింగ్ శిబిరంలో, దిగ్గజ బాక్సర్ ఎం.సి. మేరీకోమ్ సహాయక బృందంలో పనిచేసిన ఛోటే లాల్ యాదవ్ ఈ జాబితాలో ప్రముఖంగా నిలిచారు. కోచింగ్ విభాగంలో జీవితకాల సాఫల్య పురస్కారాలకు పురుషుల జాతీయ బాక్సింగ్ జట్టు కోచ్ ధర్మేంద్ర యాదవ్, రెజ్లింగ్ కోచ్ వీరేందర్ కుమార్ ఎంపికయ్యారు. అర్జున అవార్డు గ్రహీతకు రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు.

అర్జున అవార్డులకు ఎంపికైనవారు

తేజస్విన్ శంకర్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), నరేందర్ (బాక్సింగ్), విదిత్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్), ధనుష్ శ్రీకాంత్ (చెవిటి షూటింగ్), రాజ్‌కుమార్ పాల్, లాల్‌రెమ్సియామి (హాకీ), సుర్జీత్, పూజ (కబడ్డీ), రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్), ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెరాన్ (షూటింగ్), త్రీజా జాలీ, గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్), మహమ్మద్ అజ్మల్ (అథ్లెటిక్స్).

భారత్‌కు ఘోర పరాభవం

• నాలుగో వన్డేలో 244 పరుగుల తేడాతో ఓటమి • మెక్ హెన్రీ ధాటికి 89 పరుగులకే కుప్పకూలిన టీమిండియా • ఐదు వన్డేల సిరీస్‌లో 2–1తో భారత్ ఆధిక్యం





మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేలో భారత జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమైన టీమ్‌ఇండియా 244 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. తొలుత విల్ యంగ్ (125) శతకంతో చెలరేగడంతో న్యూజిలాండ్ 333 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. కివీస్ పేసర్ మాట్ హెన్రీ (6/27) ధాటికి భారత ఇన్నింగ్స్ 89 పరుగులకే కుప్పకూలింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇది రెండో అతిపెద్ద ఓటమి. అయినప్పటికీ ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2–1తో ఆధిక్యంలోనే ఉంది. నిర్ణయాత్మక ఐదో వన్డే ఆదివారం ఇదే వేదికపై జరగనుంది.

తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు

334 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. తొలి ఓవర్‌లోనే మాట్ హెన్రీ మూడు వికెట్లు పడగొట్టి భారత శిబిరంలో కలకలం రేపాడు. తొలుత రోహిత్ శర్మ (0) స్లిప్స్‌లో ఫిన్ అలెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ (0) ఇన్‌స్వింగర్‌కు క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. దీంతో భారత్ ఒక్క పరుగూ చేయకుండానే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కైల్ జేమీసన్ బౌలింగ్‌లో రుతురాజ్ గైక్వాడ్ (0) ఔటవడంతో భారత్ 9 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ ఐదో వికెట్‌కు 44 పరుగులు జోడించి కొంత ప్రతిఘటించారు. అయితే మాథ్యూ ఫిషర్ బౌలింగ్‌లో అక్షర్ వెనుదిరిగాడు. హెన్రీ మరోసారి బౌలింగ్‌కు వచ్చి కిషన్‌ను బౌల్డ్ చేయడంతో భారత్ 61 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత భారత ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. హెన్రీ ఆరు వికెట్లతో భారత బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు.

యంగ్ శతకం.. కివీస్‌కు భారీ స్కోరు

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు విల్ యంగ్, టిమ్ సీఫెర్ట్ (58; 48 బంతుల్లో) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించారు. సీఫెర్ట్ 41 బంతుల్లోనే తొలి వన్డే అర్ధశతకాన్ని నమోదు చేశాడు. భారత బౌలర్లపై విరుచుకుపడుతూ గర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. ఆకిబ్ నబీ బౌలింగ్‌లోనూ వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. మరోవైపు ఆరంభంలో నెమ్మదిగా ఆడిన యంగ్.. ఐదు పరుగుల వద్ద రోహిత్ శర్మ, ఆ తర్వాతి బంతికే ఇషాన్ కిషన్ ఇచ్చిన క్యాచ్‌లను నేలపాలు చేయడంతో రెండుసార్లు బతికిపోయాడు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న అతడు భారీ ఇన్నింగ్స్ ఆడాడు. సీఫెర్ట్ ఔటైన తర్వాత దూకుడు పెంచి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 49 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న యంగ్.. మరో 39 బంతుల్లోనే శతకాన్ని అందుకున్నాడు. మొత్తంగా 125 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించాడు.

స్పిన్నర్లపై గర్జన

భారత స్పిన్నర్లను యంగ్, ఫిన్ అలెన్ సమర్థంగా ఎదుర్కొన్నారు. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో అలెన్ వరుసగా ఫోర్లు, సిక్స్ బాదాడు. కుల్దీప్ ఓవర్‌కు తొమ్మిది పరుగులకు పైగా సమర్పించుకున్నాడు. మరోవైపు యంగ్ క్రీజులో కుదురుకుని స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగాడు. అక్షర్ పటేల్ మాత్రం కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి 10 ఓవర్లలో 39 పరుగులే ఇచ్చాడు. నిక్ కెల్లీని కూడా పెవిలియన్‌కు పంపాడు. యంగ్ వికెట్‌ను నామన్ ధీర్ సాధించాడు. అతడు ఆడిన స్వీప్ షాట్ ప్రత్యామ్నాయ ఆటగాడు కుమార్ కుశాగ్ర చేతుల్లోకి వెళ్లింది. దీంతో 256 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్ పరుగుల వేగం తగ్గింది. చివరి 10 ఓవర్లలో 68 పరుగులే చేయగలిగింది. అయినప్పటికీ 333 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ముందుంచింది.

2019 ప్రపంచకప్ సెమీస్ గుర్తుకొచ్చేలా..

మాట్ హెన్రీ ప్రదర్శన 2019 ప్రపంచకప్ సెమీఫైనల్‌ను గుర్తుచేసింది. అప్పట్లోనూ భారత టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి జట్టు ఓటమికి కారణమయ్యాడు. తాజాగా నాలుగో వన్డేలోనూ ఆరు వికెట్లతో భారత్‌ను దెబ్బతీశాడు. ఏడాది విరామం తర్వాత వన్డే ఫార్మాట్‌లో ఆడుతున్న హెన్రీ.. తన పదునైన బౌలింగ్‌తో మరోసారి భారత బ్యాటర్లను బెంబేలెత్తించాడు.



హర్మన్ కౌర్‌కు అరుదైన గౌరవం

• జైపూర్ మ్యూజియంలో మైనపు విగ్రహం

• స్వయంగా ఆవిష్కరించిన టీమిండియా మాజీ కెప్టెన్

జైపూర్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆమె మైనపు విగ్రహాన్ని జైపూర్‌లోని నహర్‌గఢ్ హిస్టారికల్ మ్యూజియంలో శుక్రవారం ఆవిష్కరించారు. స్వయంగా హర్మన్‌ప్రీత్ ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తన మైనపు విగ్రహాన్ని తొలిసారి చూస్తున్నానని, ఇది తనకు ఎంతో గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. విగ్రహాన్ని అందంగా రూపొందించిన కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు. 2025 నవంబరులో హర్మన్‌ప్రీత్ నాయకత్వంలో భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. ఈ చారిత్రక విజయం తర్వాత ఆమె మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జైపూర్ వ్యాక్స్ మ్యూజియం ప్రకటించింది. తాజాగా రూపొందించిన విగ్రహాన్ని నహర్‌గఢ్ హిస్టారికల్ మ్యూజియంలో సందర్శకుల ప్రదర్శనకు ఉంచనున్నారు.

యువ క్రికెటర్లకు అగ్నిపరీక్ష

• నేటి నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ మినీ వేలానికి ముందు యువ క్రికెటర్ల ప్రతిభకు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ వేదిక కానుంది. శనివారం నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ జాతీయ టీ20 ఛాంపియన్‌షిప్‌లో అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు గత వైభవాన్ని తిరిగి పొందాలని సీనియర్ ఆటగాళ్లు పట్టుదలతో ఉన్నారు. డిసెంబరు 16న గోవాలో జరగనున్న ఐపీఎల్ మినీ వేలానికి పది రోజుల ముందే టోర్నీ ముగియనుండటంతో ఫ్రాంచైజీల ప్రతినిధులు యువ ప్రతిభను గుర్తించేందుకు ఈ పోటీలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఐపీఎల్‌లో చోటు ఆశిస్తున్న అన్‌క్యాప్డ్ భారత ఆటగాళ్లకు సత్తా నిరూపించుకునేందుకు ఇదే చివరి అవకాశం కానుంది.

పృథ్వీ షాకు కీలక పరీక్ష

ఒకప్పుడు భారత క్రికెట్ భవిష్యత్ స్టార్‌గా గుర్తింపు పొందిన పృథ్వీ షాకు ఈ టోర్నీ కీలకం కానుంది. 2025 ఐపీఎల్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని కొనుగోలు చేసినా.. గత సీజన్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం దక్కలేదు. ఈసారి ముస్తాక్ అలీ టోర్నీలో మెరుగైన ప్రదర్శనతో తిరిగి ఐపీఎల్ జట్టులో చోటు సంపాదించాలని చూస్తున్నాడు. దీపక్ చాహర్, మనీశ్ పాండే వంటి సీనియర్లతో పాటు శిఖర్ మోహన్, ప్రశాంత్ వీర్, శశాంక్ సింగ్, దిగ్వేశ్ రాఠీ కూడా తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. గత వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ రూ.14.2 కోట్లకు కొనుగోలు చేసిన ఉత్తరప్రదేశ్ ఎడమచేతి వాటం స్పిన్ ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్.. ఐపీఎల్‌లో లభించిన పరిమిత అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ టోర్నీలో రాణించి తనపై ఫ్రాంచైజీ పెట్టుకున్న అంచనాలను నిలబెట్టుకోవాలని భావిస్తున్నాడు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తొలి రెండు మ్యాచ్‌ల్లో బిహార్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తన దూకుడైన ఆటతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాలని చూస్తున్నాడు.

జాతీయ జట్టులో పునరాగమనంపై ఆశలు

టీమిండియాలో తిరిగి స్థానం సంపాదించుకోవాలన్న ఆశతో మహమ్మద్ షమీ, 2026 టీ20 ప్రపంచకప్ విజేత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నారు. గత వారం టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన షమీ.. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో తన సత్తా చాటాలని భావిస్తున్నాడు. జాతీయ జట్టులో పునరాగమన అవకాశాలు తక్కువగా ఉన్నా.. ఐపీఎల్‌లో చోటు దక్కించుకోవడమే అతడి ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. గత ఏడాది తొలిసారి టైటిల్ సాధించిన ఝార్ఖండ్ ఈసారి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీలో మొత్తం 38 రంజీ జట్లు పాల్గొననున్నాయి. వీటిని ఎనిమిది జట్ల చొప్పున నాలుగు ఎలైట్ గ్రూపులుగా, ఆరు జట్లతో ఒక ప్లేట్ గ్రూపుగా విభజించారు.

తొమ్మిదోసారి సాధిస్తారా?

• నేడు అండర్–19 ఆసియా కప్ ఫైనల్ • చిరకాల ప్రత్యర్థితో తలపడనున్న టీమిండియా

అల్ అమేరత్: అండర్–19 ఆసియా కప్ టైటిల్ పోరుకు భారత్, పాకిస్థాన్ జట్లు సిద్ధమయ్యాయి. శనివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్‌ను ఓడించి ట్రోఫీని సొంతం చేసుకోవాలని భారత యువ జట్టు పట్టుదలతో ఉంది. గత ఏడాది ఫైనల్లో పాక్ చేతిలో 151 పరుగుల తేడాతో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకోవాలని భావిస్తోంది. మరోవైపు రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి టైటిల్ గెలుచుకోవడంపై భారత్ కన్నేసింది. మ్యాచ్ ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది. భారత జట్టులో ఆర్యవీర్ సెహ్వాగ్, ఇషాన్ సూద్ అద్భుత ఫామ్‌లో ఉన్నారు. మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడైన ఆర్యవీర్ నాలుగు మ్యాచ్‌ల్లో 101 సగటు తో 303 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. మరోవైపు పేసర్ ఇషాన్ సూద్ నాలుగు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు పడగొట్టి ఆకట్టుకున్నాడు. అయితే మిగతా ఆటగాళ్ల నుంచి వీరికి ఆశించిన సహకారం లభించడం లేదు. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, వికెట్ కీపర్ అన్వయ్ ద్రవిడ్, అర్జున్ రాజ్‌పుత్, వీకే వినీత్ నిలకడగా రాణించాల్సి ఉంది. గ్రూప్ దశలో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ సెంచరీ చేయగా.. సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌పై లక్ష్య 93 పరుగులతో రాణించాడు. వినీత్ అర్ధసెంచరీ సాధించాడు. ఫైనల్లోనూ వీరం తా సమష్టిగా రాణిస్తే భారత్‌కు విజయావకాశాలు మెరుగ వుతాయి.

బౌలింగ్‌లోనూ సమష్టి ప్రదర్శన అవసరం

భారత బౌలింగ్ భారమంతా ఇషాన్ సూద్‌పైనే ఎక్కువగా ఉంది. స్పిన్నర్లు అర్జున్ రాజ్‌పుత్, మనాల్ చౌహాన్ నుంచి అతడికి మరింత సహకారం అవసరం. వీరిద్దరూ చెరో ఐదు వికెట్లు తీసినప్పటికీ.. అందులో మూడేసి వికెట్లు ఒకే మ్యాచ్‌లో సాధించారు. ఫైనల్లో బౌలర్లంతా సమష్టిగా రాణించాల్సి ఉంటుంది.

పాక్ జట్టులోనూ కీలక ఆటగాళ్లు

పాకిస్థాన్ తరఫున ఉస్మాన్ ఖాన్ నాలుగు మ్యాచ్‌ల్లో 238 పరుగులు చేశాడు. పేసర్ రిజ్వానుల్లా 11 వికెట్లు పడగొట్టాడు. గ్రూప్ దశలో భారత్‌పై సెంచరీ చేసిన హంజా జహూర్ మరోసారి అదే స్థాయి ప్రదర్శన చేయాలని చూస్తున్నాడు. మహమ్మద్ సయ్యమ్ ఎనిమిది, అలీ రజా ఆరు వికెట్లతో పాక్ బౌలింగ్‌కు బలంగా నిలుస్తున్నారు. దీంతో ఫైనల్లో ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది.





8 రోజుల్లో రూ.1,033 కోట్లు

- బాక్సాఫీస్ వద్ద 'రామాయణ' ప్రభంజనం
- భారత్‌లో రూ.675 కోట్లు.. విదేశాల్లో రూ.358 కోట్ల కలెక్షన్లు
- రూ.1,000 కోట్ల క్లబ్‌లో చేరిన 11వ భారతీయ చిత్రంగా రికార్డు
- 2028 దీపావళికి రెండో భాగం విడుదల

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన 'రామాయణ' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. విడుదలైన కేవలం ఎనిమిది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1,000 కోట్ల వసూళ్ల మైలురాయిని దాటింది. దీంతో ఈ ఘనత సాధించిన 11వ భారతీయ చిత్రంగా నిలిచింది. 'దంగల్', 'బాహుబలి–2', 'పుష్ప–2', 'ధురంధర్–2' వంటి భారీ విజయాల సరసన చేరింది. ట్రేడ్ వెబ్‌సైట్ సాక్‌నిల్క్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.1,033.55 కోట్ల వసూళ్లు సాధించింది. ఇందులో భారత్ నుంచి రూ.675.05 కోట్లు, విదేశాల నుంచి రూ.358.50 కోట్లు వచ్చాయి.

దీపావళి సెలవులు.. భారీ వసూళ్లు

నవంబరు 5న విడుదలైన ఈ చిత్రానికి దీపావళి పండుగ సెలవులు కలిసివచ్చాయి. దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో సినిమాకు మంచి ఆదరణ లభించడంతో పాటు విదేశాల్లోనూ భారీ సంఖ్యలో థియేటర్లలో విడుదల చేయడం వసూళ్లకు దోహదపడింది. సుమారు రూ.2,000 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు ప్రచారం జరుగుతోంది. రానున్న రోజుల్లో వసూళ్లు మరింత పెరిగి అత్యధిక కలెక్షన్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో పైస్థానాలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలు

ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో నితేశ్ తివారీ దర్శకత్వంలోని 'దంగల్' రూ.2,070 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురంధర్–2' రూ.1,813.40 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. 'బాహుబలి–2' రూ.1,788 కోట్లు, 'పుష్ప–2' రూ.1,742 కోట్లు, 'ధురంధర్' రూ.1,307.35 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్' రూ.1,230 కోట్లు, 'కేజీఎఫ్–2' రూ.1,215 కోట్లు, 'జవాన్' రూ.1,160 కోట్లు, 'పఠాన్' రూ.1,055 కోట్లు, 'కల్కి 2898 ఏడీ' రూ.1,042.25 కోట్ల వసూళ్లతో తొలి పది స్థానాల్లో ఉన్నాయి. సినిమా రెండో భాగాన్ని 2028 దీపావళికి విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది.



డిసెంబర్‌లో రష్మిక మైసా?

రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' విడుదలపై సందిగ్ధత నెలకొంది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికీ.. ఇప్పటివరకు ప్రచార కార్యక్రమాలు ప్రారంభం కాలేదు. దీంతో సినిమా వాయిదా పడే అవకాశాలున్నాయనే చర్చ మొదలైంది. నవంబరుకు బదులుగా డిసెంబరులో విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఫిల్మ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. నూతన దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక గోండు గిరిజన మహిళగా, శక్తిమంతమైన యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఆమె.. దాదాపు మూడున్నర నిమిషాల అండర్‌వాటర్ ఫైట్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేసినట్లు దర్శకుడు వెల్లడించారు. దీంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. అజయ్ సాయిపురెడ్డి, అనిల్ సాయపురెడ్డి, వీరసాయి గోపా యూనిఫార్మ్‌లా ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఈశ్వరి రావు, రాహుల్ రవీంద్రన్, సముద్రఖని, రావు రమేష్, గురు సోమసుందరం తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రౌడీ జనార్ధన విలన్‌గా జోజు జార్జ్



విజయ్ దేవరకొండకు దీటైన ప్రతినాయకుడిని రంగంలోకి దించేందుకు 'రౌడీ జనార్ధన' చిత్ర బృందం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విలన్ పాత్ర కోసం మలయాళ నటుడు జోజు జార్జ్‌ను ఎంపిక చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలుత ఈ పాత్ర కోసం విజయ్ సేతుపతిని సంప్రదించగా.. ఆయన రూ.20కోట్ల పారితోషికం అడిగినట్లు సమాచారం. ఆ తర్వాత ఎస్.జే. సూర్యను సంప్రదించగా, ఆయన రూ.15 కోట్లు డిమాండ్ చేసినట్లు టాక్. దీంతో చివరకు జోజు జార్జ్ వైపు చిత్ర బృందం మొగ్గు చూపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ కాస్టింగ్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో రాజశేఖర్ పేరు కూడా విలన్ పాత్రకు సంబంధించి ప్రచారంలోకి వచ్చింది. 'రణబాలి' తర్వాత విజయ్ దేవరకొండ నటిస్తున్న ఈ చిత్రానికి 'రాజా వారు రాణిగారు', 'మిడిల్ క్లాస్ మెలోడీస్' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. 1980ల గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది.



పేటీఎంకు భారీ ఊరట

- వాలెట్ సేవల పునరుద్ధరణకు ఆర్‌బీఐ ప్రాథమిక అనుమతి

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎంకు ఊరట లభించింది. వాలెట్ల నిర్వహణ కోసం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్‌కు చెందిన అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్ (పీపీఎస్ఎల్)కు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ప్రాథమిక అనుమతి మంజూరు చేసింది. నవంబర్ 13న ఈ అనుమతి లభించినట్లు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. అయితే, తుది ఆమోదం, అధికారిక ధ్రువీకరణ పత్రం అందిన తర్వాతే వాలెట్ సేవలను ప్రారంభించాల్సి ఉంటుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పీపీఎస్ఎల్ తన నిర్వహణ వ్యవస్థలు, సైబర్ భద్రతపై ప్రత్యేక ఆడిట్ చేయించుకోవాలి. ఇందుకోసం సీఈఆర్‌టీ–ఇన్ గుర్తింపు పొందిన ఆడిటర్లు, అర్హత కలిగిన నిపుణులతో తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. పేటీఎం 2014లో వాలెట్ సేవలను ప్రారంభించి, 2017లో ఈ వ్యాపారాన్ని పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు బదిలీ చేసింది. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో 2022లో కొత్త ఖాతాదారుల చేరికపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. 2024 జనవరిలో కొత్త డిపాజిట్లు, నగదు జమలు, వాలెట్ రీచార్జీలను నిలిపివేసింది. 2026 ఏప్రిల్‌లో బ్యాంకు లైసెన్సును రద్దు చేయగా, జులైలో ఢిల్లీ హైకోర్టు మూసివేతకు ఆదేశించింది. మరోవైపు, 2026 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో వన్ 97 కమ్యూనికేషన్స్ రూ.225 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంలోని రూ.21 కోట్లతో పోలిస్తే పది రెట్లకు పైగా వృద్ధి సాధించింది. కార్యకలాపాల ఆదాయం 28 శాతం పెరిగి రూ.2,648 కోట్లకు చేరింది.



డెలివరీ సేవల్లోకి 2వేల విద్యుత్ వాహనాలు

ముంబై: నగరాల్లో సరకు రవాణా సేవలను విద్యుదీకరించేందుకు లాజిస్టిక్స్ సంస్థ డెలివరీ సిద్ధమైంది. టాటా మోటార్స్, యూలర్ మోటార్స్, మోంత్రా ఎలక్ట్రిక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వచ్చే 12–18 నెలల్లో 1,500–2,000 నాలుగు చక్రాల విద్యుత్ వాణిజ్య వాహనాలను ప్రవేశపెట్టనుంది. మూడేళ్లలో మొత్తం 5,000 ఈవీలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. టాటా మోటార్స్ నుంచి ఇంట్రా ఈవీ, యూలర్ మోటార్స్ నుంచి టర్బో సిటీ ప్లస్ వాహనాలను తొలుత వినియోగించనుంది. అధిక సరకు రవాణాకు పెద్ద సామర్థ్యం కలిగిన వాహనాలను కూడా చేర్చనుంది. మోంత్రా ఎలక్ట్రిక్‌తో కలిసి ఈవియేటర్ వాహనాల వినియోగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనుంది. రోజుకు 200 కి.మీ.లోపు ప్రయాణించే నగరాంతర్గత వాహనాలపై సంస్థ దృష్టి పెట్టింది. ప్రస్తుతం అర్హమైన వాహన సముదాయంలో ఈవీల వాటా 12–13 శాతంగా ఉండగా, రెండుమూడేళ్లలో 50శాతానికి పెంచాలని భావిస్తోంది. నాలుగైదేళ్లలో 200 కిలోమీటర్లలోపు ప్రయాణించే వాహనాలన్నింటినీ విద్యుత్ వాహనాలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఛార్జింగ్, పార్కింగ్ సదుపాయాలను విస్తరిస్తోంది.

మైక్రోసాఫ్ట్ సేవలకు అంతరాయం

- ప్రపంచవ్యాప్తంగా స్తంభించిన అవుట్‌లుక్, టీమ్స్, కోపైలట్ సేవలు
- రెండో రోజూ సంస్థలు, ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రభావం
- ఆసియా పసిఫిక్ ప్రాంతంలో క్రమంగా పునరుద్ధరణ
- అవుట్‌లుక్ ఈ–మెయిల్ సేవల్లో కొనసాగుతున్న సమస్యలు
- ఇండిగో, ఆకాశ ఎయిర్ ఈ–మెయిల్ సేవలకు ఆటంకం
- సైబర్ దాడి కారణం కాదన్న సంస్థ
- పరిష్కారానికి ఇంజినీర్ల కసరత్తు



న్యూఢిల్లీ/హాంకాంగ్: ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవలకు ఏర్పడిన అంతరాయం రెండో రోజూ కొనసాగుతోంది. అవుట్‌లుక్, టీమ్స్, కోపైలట్ వంటి సేవలు సరిగా పనిచేయకపోవడంతో పలు దేశాల్లో వినియోగదారులు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సమస్య పరిష్కారానికి మైక్రోసాఫ్ట్ విస్తృతంగా చర్యలు చేపట్టింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రభావితమైన మౌలిక సదుపాయాల్లో కొన్నింటిని పునరుద్ధరించామని, సేవలను దశలవారీగా అందుబాటులోకి తెస్తున్నామని శుక్రవారం ప్రకటించింది. అయితే, మైక్రోసాఫ్ట్ 365 సేవల్లో ఇంకా అంతరాయాలు కొనసాగుతున్నాయి.

ఆసియా పసిఫిక్‌లో పునరుద్ధరణ

ప్రభావిత సర్వర్లలో పునరుద్ధరణ చర్యలు చేపట్టడంతో మెయిల్ బాక్సులను వినియోగించుకోవడంలో కొంత మెరుగుదల కనిపిస్తోందని మైక్రోసాఫ్ట్ తెలిపింది. అలస్యంగా చేరుతున్న ఈ–మెయిళ్ల సమస్య కూడా క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. అయినప్పటికీ కొంతమంది వినియోగదారులకు అప్పుడప్పుడు అంతరాయాలు ఎదురుకావొచ్చని హెచ్చరించింది. ఇతర ప్రాంతాల్లోనూ పునరుద్ధరణ చర్యలను విస్తరించడంతో పాటు ఈ–మెయిళ్ల పెండింగ్ క్యూలను తగ్గించడంపై దృష్టి సారించినట్లు వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకూ సంస్థ సేవల స్థితిగతుల పేజీలో మైక్రోసాఫ్ట్ 365 సేవలకు అంతరాయం కొనసాగుతున్నట్లు చూపించింది.

విమానయాన సంస్థలకు ఇబ్బందులు

భారత్‌లో ఇండిగో, ఆకాశ ఎయిర్ ఈ–మెయిల్ ఆధారిత సహాయ సేవల్లో జాప్యం ఏర్పడింది. ప్రయాణికుల నుంచి వచ్చే ఈ–మెయిళ్లను స్వీకరించడంలో ఇబ్బందులు ఉన్నాయని ఇండిగో తెలిపింది. తక్షణ సహాయం అవసరమైన వారు 24 గంటల కస్టమర్ కేర్ కేంద్రాన్ని లేదా సామాజిక మాధ్యమాలను సంప్రదించాలని ఆకాశ ఎయిర్ సూచించింది. ఎయిరిండియా మాత్రం తమ విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బందులూ లేవని, కమ్యూనికేషన్ మార్గాలపైనా ప్రభావం పడలేదని వెల్లడించింది. ఈ–మెయిళ్లు సజావుగా అందేలా తాత్కాలికంగా వాటిని మరో మార్గానికి మళ్లించినట్లు తెలిపింది. ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్, ఈ–మెయిల్ సేవలతో అనుసంధానమైన మైక్రోసాఫ్ట్ 365 ఫీచర్లే ప్రధానంగా ప్రభావితమయ్యాయని సంస్థ వివరించింది. అవుట్‌లుక్ వెబ్, డెస్క్‌టాప్ ద్వారా మెయిల్ బాక్సులను తెరవడం, ఈ–మెయిళ్లు చేరడంలో జాప్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. టీమ్స్‌లో కాల్స్, సమావేశాల్లో పాల్గొనడం, గ్రూప్ చాట్స్, సందేశాలు వంటి ప్రధాన ఫీచర్లు పనిచేస్తున్నప్పటికీ క్యాలెండర్‌కు సంబంధించిన పనుల్లో అంతరాయాలు ఉండొచ్చని తెలిపింది.

సైబర్ దాడికి ఎలాంటి ఆధారాల్లేవు

సర్వర్లలో అనూహ్యంగా ఏర్పడిన అందుబాటు సమస్యలే అంతరాయానికి కారణమని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. వినియోగదారుల రద్దీ పెరగడం వల్ల ఈ సమస్య తలెత్తలేదని స్పష్టం చేసింది. సైబర్ దాడి లేదా దురుద్దేశపూర్వక కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలేవీ లేవని సంస్థ ఉన్నతాధికారులు వెల్లడించారు. సమస్య పూర్తిగా పరిష్కారమైన తర్వాత అసలు కారణాలతో కూడిన సమగ్ర నివేదికను విడుదల చేస్తామని తెలిపింది. వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ చందోక్ విచారం వ్యక్తం చేశారు.

పలు దేశాల్లో ప్రభుత్వ సేవలపైనా ప్రభావం

అవుట్‌లుక్ సేవల అంతరాయంతో అమెరికా నుంచి ఆసియా వరకు పలు సంస్థల కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. సింగపూర్ ప్రభుత్వ ఈ–మెయిల్ సేవలు నిలిచిపోగా, ఫిలిప్పీన్స్ సుప్రీంకోర్టు ఈ–మెయిల్ స్పందనల్లోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. జపాన్ ప్రభుత్వ సమాచార సాంకేతిక వ్యవస్థపైనా ప్రభావం పడింది. హాంకాంగ్‌లో కొన్ని బ్యాంకుల కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సంస్థలు సైతం మైక్రోసాఫ్ట్ 365 అనుసంధాన సేవల్లో సమస్యలు ఎదుర్కొన్నాయి.

ఖైదీల విడుదలపై ఎఫెక్ట్

మైక్రోసాఫ్ట్ సేవల్లో ఏర్పడిన అంతరాయం కారణంగా అమెరికాలోని ఓ జైల్లో ఖైదీల విడుదల కూడా నిలిచిపోయింది. ఖైదీల విడుదల కోసం సమర్పించే పూచీకత్తును వెరిఫై చేసేందుకు అవసరమైన అవుట్‌లుక్ ఈ–మెయిల్ నోటిఫికేషన్స్ రాకపోవడమే ఇందుకు కారణమైంది. కొలరాడో రాష్ట్రంలోని అరాపహో కౌంటీ డెటెన్షన్‌లో ఈ సమస్య ఏర్పడినట్లు జైలు అధికారులు ఎక్స్ వేదికగా వెల్లడించారు.

మూడు రోజుల లాభాలకు బ్రేక్

- రెండేళ్ల గరిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- 6.09 శాతంగా నమోదు
- 319 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 155.05 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ఆర్‌బీఐ వడ్డీరేట్ల పెంపు భయాలతో అమ్మకాల ఒత్తిడి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస లాభాలకు శుక్రవారం బ్రేక్ పడింది. అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం రెండేళ్ల గరిష్ఠానికి చేరి 6.09 శాతంగా నమోదవడంతో వచ్చే నెలలో ఆర్‌బీఐ వడ్డీరేట్లు పెంచవచ్చన్న ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. సెన్సెక్స్ 318.56 పాయింట్లు తగ్గి 81,592.45 వద్ద, నిఫ్టీ 155.05 పాయింట్లు నష్టపోయి 25,144.30 వద్ద ముగిశాయి. ఈ నెలలో సూచీలకు ఇదే అతిపెద్ద పతనం. సెప్టెంబరులో 5.54 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబరులో ఆర్‌బీఐ గరిష్ఠ పరిమితి 6 శాతాన్ని దాటి 6.09 శాతానికి చేరింది. ఆహార ద్రవ్యోల్బణం సైతం 7.74 నుంచి 8.94 శాతానికి పెరిగింది. దీంతో డిసెంబరు సమీక్షలో రెపోరేటు పెరిగే అవకాశాలున్నాయన్న అంచనాలు మార్కెట్లను దెబ్బతీశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎన్‌టీపీసీ, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ లాభపడ్డాయి. రియల్టీ 1.70 శాతం, ఆటో 1.19 శాతం, కమోడిటీస్ 1.11 శాతం నష్టపోయాయి. టెలికాం, విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, ఆసుపత్రుల రంగాలు లాభాల్లో నిలిచాయి. రూపాయి క్షీణత, ముడిచమురు ధరల పెరుగుదల, అమెరికా బాండ్ ఈల్డ్స్ ఎగబాకడం కూడా మార్కెట్లపై ఒత్తిడి పెంచాయని నిపుణులు తెలిపారు. ఇంధన ధరల పెరుగుదల కంపెనీల లాభదాయకత, వినియోగంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.